క్లుప్తంగా

కూరగాయల పంపిణీ



వీపనగండ్ల: మండలంలోని కొర్లకుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆంజనేయ ఫౌండేషన్ సభ్యులు కూరగాయలను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు పౌష్టిక విలువలతో కూడి భోజనాన్ని అందించాలనే సదుద్దేశంతో కూరగాయలను పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమ సంస్థ నుంచి మరి కొన్ని పాఠశాలలకు కూడా ఉచితంగా కూరగాయలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పోషకాహార వారోత్సవాల ర్యాలీ



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో జాతీయ పోషకాహార వారోత్సవాల ర్యాలీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తల్లిబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతగానో ఉపయోగపడుతుందని అంగన్‌వాడీ టీచర్లు గర్భిణి, బాలింతలకు సూచించారు. పోషక విలువలు గల ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు పోషకాహార అవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, రాంచంద్రమ్మ, రాణి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మదనాపురం: కలెక్టర్ ఆదేశాల మేరకు మెడికల్ ఆఫీసర్ రతన్‌కుమార్ ఆధ్వర్యంలో మదనాపురం ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజన సమయంలో చేతులు శుభ్రంగా కడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి బెనర్జీ, హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీలమ్మ, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు సన్మానం



కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన సౌమ్య, సాహితీ ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడంతో వారిని యోగా టీం సభ్యులు శుక్రవారం విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం యోగా టీం సభ్యులు మాట్లాడుతూ వైద్యం అనేది ఒక వృత్తిగా కాకుండా సేవ చేసే పనిగా భావించాలన్నారు. మనుషులను బతికించే శక్తి డాక్టర్‌కు మాత్రమే ఉంటుందని, అంకితభావంతో పనిచేసి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, ఎద్దుల నాగేష్, దేవన్న, సత్యం, అమృతరెడ్డి, సుభాష్, శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటయ్యచారి, మాధవరెడ్డి, నాగిరెడ్డి, నాగరాజు, బ్రహ్మ, సంతోష్, నర్సయ్య, కృష్ణసాగర్, భాస్కర్ ఉన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అపోహలు వద్దు

అడ్డాకుల: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఆయూష్‌శాఖ ద్వారా వృద్ధులకు ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. వృద్ధాప్యంలో ఉన్న వారు బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద తగిన పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఆయుర్వేద వైద్యంపై అపోహలను వీడాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



శ్రీరంగాపురంలో శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

కొత్తకోట రూరల్: శ్రావణమాస బోనాల పండుగ సందర్భంగా శుక్రవారం మండలంలోని కనిమెట్ట శివారులో గల కాళికాదేవిని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు గ్రామంలో కాళికాదేవి ఉత్సవ విగ్రహాన్ని ఎమ్మెల్యే నెత్తిపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కాళికాదేవి బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. చిన్నారులు, యువతులు సాంప్రదాయ దుస్తువులు ధరించి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు, గాడీల ప్రశాంత్, సర్పంచ్ గాదం రాణి, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, మాజీ సర్పంచ్ పెంటన్న, సంజీవయ్యచారి, పరమేష్, కోటీశ్వర్‌రెడ్డి, మన్యంకొండ, నాగేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పెబ్బేరు రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కృష్ణాష్టమి ఉత్సవ నిర్వాహకులు వెంకట్రాములు, కృష్ణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నాగరాల 1 సెంటర్, శ్రీరంగాపురం పట్టణ కేంద్రంలోని ప్రధాన వీధుల్లో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను భక్తులతో కలిసి ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నిర్మల, వినీలా రాణి, ప్రబోధ సమితి సభ్యులు సురేష్, బాలయ్య, నాగరాజు, బద్రి, నాని, మణెమ్మ, చంద్రాయుడు, కొత్తకోట సభ్యులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లిలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామిని ఊరేగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో దేవాలయం ఆవరణలో ఉట్లు కొట్టారు. గ్రామంలోని యువకులు ఉట్లు కొట్టేందుకు పోటీపడ్డారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి మరుసటి రోజున దేవాలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని సర్పంచ్ దేవేందర్ ముదిరాజ్, గ్రామస్తులు తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి అమానుషం

పాన్‌గల్: సంగారెడ్డి జిల్లాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై బీజేపీ నాయకుల దాడి చేయడం అమానుషం అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను కడుతున్న సమయంలో ఎస్‌ఎఫ్‌ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్‌పై దాడి చేసి గాయపర్చిన ఏబీవీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహించే పోరాటాలకు సీఐటీయూ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

దేశానికే తలమానికం తెలంగాణ

నర్వ: అభివృద్ధిలో తెలంగాణ దేశానికే తలమానికంగా నిలిచిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాంకిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చి గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషిచేశామన్నారు. గ్రామాల్లో నర్సరీలు, డంపింగ్‌యార్డులు, పల్లెప్రకృతివనాలు, క్రీడాప్రాంగణాలు, పంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, డ్రెయినేజీలు, చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, లక్ష్మన్న, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు దండు అయ్యప్ప, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

■ శ్రీకృష్ణ పరమాత్ముడు ధర్మానికి రక్షకుడని ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి యుగంలో జన్మిస్తానని గీతలో చెప్పారని ఎమ్మెల్యే చిట్టెం అన్నారు. శుక్రవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో చేపట్టిన ఉత్సవాలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఓటరు జాబితా పూర్తి చేయాలి





ఆత్మకూర్‌లో బీఎల్వోలతో సమావేశమైన తహసీల్దార్.. దుప్పల్లిలో..

ఆత్మకూర్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునే వారి వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మదనాపురం: మండలంలోని దుప్పల్లి ప్రాథమిక పాఠశాల 173వ పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నరేష్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న వసతులను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్ తారమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సింహగర్జన వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం నాయకులు

కొత్తకోట: రాష్ట్రంలో బీసీ జనాభా దమాషా ప్రకారం త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 60సీట్లు బీసీలకు ఇవ్వడంతో పాటు ముఖ్యమంత్రి పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భీమన్ననాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 10న హైదరాబాద్‌లో చేపట్టిన 'బీసీ సింహ గర్జన' బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కొత్తకోట చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా భీమన్న నాయుడు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలనే నినాదంతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ఈనెల 10న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బీసీ సంహ గర్జన మహాసభను పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలరాజుగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నాగరాజు, ముంత రాములుయాదవ్, ఎస్టీడీ వెంకటేష్, హోటల్ రాజ నాయుడు, గోవర్ధన్‌నాయుడు, డీసీ రాములు, మొగులయ్య, వడ్డె నాగరాజు, బందెన్న, యాట కాశన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో క్షయ వ్యాధి నివారణపై శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా ఎడతెగని దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు తెమడ(కళ్లే) వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారు ఆరు నెలలు పాటు క్రమం తప్పకుండా మందులు వాడితో వ్యాధి నయమవుతుందని తెలిపారు. వ్యాధి సోకిన వారు బయట తిరగవద్దని, ఉమ్మరాదన్నారు. వ్యాధి సోకిన వారు బలవర్థక పోషకాహారాన్ని తినేందుకు వ్యాధి పూర్తిగా నయం అయ్యే వరకు ప్రతి నెల వైద్య ఆరోగ్యశాఖ రూ.500 అందిస్తారన్నారు. దీంతో పాటు వర్షాకాలంలో మలేరియా, డెంగ్యు తదితర వ్యాధులు సోకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రంలోని పాన్‌గల్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, జములమ్మ ఆలయం, బీఎస్‌ఎన్‌ఎల్ టవర్, అంబేడ్కర్ చౌక్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ తులసి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాన్‌గల్ రోడ్డులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో భాగంగా స్తంభాలు పాతడం, 11 కేవీ, ఎల్‌టీ లైన్లకు ఉన్న గృహ, వ్యాపార, పరిశ్రమల కనెక్షన్లను కొత్తగా లాగిన తీగలకు కలిపే పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో ఉండే గృహ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

పాన్‌గల్/కొత్తకోట రూరల్: వివిధ ఘటనలపై కేసులు నమోదైన వారు రాజీ చేసుకునేందుకు వీలు కల్పించే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పాన్‌గల్ ఎస్ఐ వేణు, పెద్దమందడి ఎస్ఐ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసులు ఉన్న వారు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు హాజరైతే వారిని కోర్టులో హాజరు పర్చి కేసులు ఉపసంహరించుకునేలా చేస్తామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసును పూర్తిగా ఉపసంహరించుకునే అవకాశం ఉందని, దీంతో యాక్సిడెంట్, ఘర్షణ, చీటింగ్, చిట్‌ఫండ్ మోసాలు, భూతగాదాలు, వివాహ బంధానికి సంబంధించినవి, చిన్న, చిన్న దొంగతనం, అక్రమ రవాణా (మట్టి, ఇసుక, కట్టెలు, మద్యం), పేకాట కేసులు, లాక్‌డౌన్ కేసులు, ట్రాఫిక్ ఉల్లంఘన, గుట్కా, పిట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి కేసులు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసులను రాజీ చేసుకునే వారు ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఇద్దరు వారి ఆధార్‌కార్డులను తీసుకొని పోలీసు స్టేషన్‌కు హాజరుకావాలని వారు కోరారు.

చెన్నకేశవస్వామి కల్యాణం

అడ్డాకుల: కొమిరెడ్డిపల్లిలో శుక్రవారం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. సర్పంచ్ సాయిరెడ్డి, వెంకటమ్మ దంపతులతో పండితులు హోమం చేపట్టారు. శనివారం తెల్లవారుజామున రథోత్సవం, సాయంత్రం జాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎంపీపీలు బగ్గి కృష్ణయ్య, కమలమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ లింగారెడ్డి, ధర్మకర్తలు కళాధరాచారి, మాధవచారి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



పాన్‌గల్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దావాజిపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డుకు ఇరువైపులా నాటుతున్న మొక్కలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఎక్కువగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛ గ్రామాలుగా మార్చుటకు ప్రజలను భాగాస్వాములను చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికులను పర్మినెంట్ చేయాలి



వనపర్తి: శ్రమ దోపిడి చేసే ఏజెన్సీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి జిల్లా ఆస్పత్రి కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో భోజన విరామ సమయంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య రంగంలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, ఇతర కార్మికులకు కనీస వేతనాలు రావటం లేదని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినా.. పాలకులు కోర్టు ఆదేశాలను పాటించటం లేదని విమర్శించారు. కరోనా లాంటి ఆపత్కాల సమయంలో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రభుత్వం భరోసాగా హామీ ఇచ్చి విస్మరించటం సరికాదన్నారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి బ్రాంచ్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, నరసింహ, బాలరాజ్, దుర్గాస్వామి, నరేందర్, ఆంజనేయులు, శ్రీకాంత్, రాజశేఖర్, ప్రేమకుమారి, అనిత, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పుర కార్మికులను క్రమబద్ధీకరించాలి



పుర చైర్మన్ గట్టుయాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వనపర్తిటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పుర సిబ్బంది జిల్లాకేంద్రంలో ధర్నా చేపట్టి పుర కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, కమిషనర్ విక్రమసింహారెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. కార్మికులకు వేతనాలు కేటగిరీల వారీగా అందించాలని.. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు రూ.21 వేల వేతనం ఇవ్వాలన్నారు. ఐఆర్, మధ్యంతర భృతి వర్తింపజేయాలని, లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని, మున్సిపల్ జనరల్ ఫండ్ ననుంచి కాకుండా మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల నుంచే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, వారసులు లేని వారికి రూ.15 లక్షలు ఇవ్వాలని, ఆదివారం, పండుగ సెలవులు, ఎనిమిది గంటల పనిదినాన్ని వాటర్ వర్కర్స్‌తో సహా అందరికి వర్తింపజేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్మికులు గడ్డం కురుమయ్య, యాదగిరి, బాలు, సురేందర్, నరేష్, శాంతయ్య, మన్యం, చందు, వెంకటమ్మ, గోపాలమ్మ, మన్యం, లాల్, గోపాల్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా రోడ్డు.. రాకపోకలకు ఇబ్బందులు



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో కొద్దిపాటి వర్షాలకే గ్రామంలోని ప్రధాన రోడ్డు చిత్తడిగా మారడంతో గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి శ్రీరంగాపూర్ మీదుగా పెబ్బేరు పట్టణానికి వెళ్లేందుకు ప్రధాన రోడ్డు ఇదే కావడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి రోడ్డుపై అత్యవసరంగా మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యానికి తూట్లు

పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గంలో భారత రాజ్యాంగం అమలు చేయకుండా ప్రజాస్వామ్యాన్ని కొందరు ఖూనీ చేస్తున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సస్పెండ్ అయిన సర్పంచులు, ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ మారిన బహుజన ప్రజా ప్రతినిధులపైన మంత్రి నిరంజన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్ కల్పించిన ప్రభుత్వం నిజంగా అక్రమాలు జరిగినట్లు రుజువైతే ఇద్దరినీ సస్పెండ్ చేయాల్సిన అధికారులు, సర్పంచ్‌నే ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు. బీసీ వర్గానికి చెందిన తాడిపర్తి, చికటోనిపల్లి, పెద్దమందడి సర్పంచ్‌లను సస్పెండ్ చేయడం ఏమిటన్నారు. బహుజనులపై అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోక పోతే బహుజనలంతా కలిసి మంత్రిని నియోజకవర్గం నుంచి పంపించడానికి వెనుకాడరన్న సంగతి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామిసాగర్, చిలకటోనిపల్లి సర్పంచ్ పద్మమ్మ, మందరితండా సర్పంచ్ జయంతి, చీకటిచెట్టుతండా సర్పంచ్ రాధాకృష్ణ, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, నాయకులు అంజి, బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు అంజన్నయాదవ్, మహేందర్‌నాయుడు, నరేష్, రామచంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచాల యుగేంధర్‌గౌడ్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నాగసానిపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లిలో పారిశుద్ధ్య కార్మికురాలు గంధం గోవిందమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ. 15 వేలు ఆర్థికసాయం అందజేశారు. గంధం గోవిందమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో బీఆర్‌ఎస్ నాయకుడు ప్రమోద్ కుమార్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తేజ, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన బోరెల్లి ఎల్లయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీరంగాపురం మండల మేఘారెడ్డి యువసేన ఆధ్వర్యంలో తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.10 వేలు పంపించారు. యువసేన సభ్యులు శుక్రవారం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య శంకరమ్మకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా సభ్యులు గంధం రంజిత్‌కుమార్, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నా గౌడు, గంధం సునీల్, ఈశ్వరయ్య, శ్రీహరి, శంకర్‌నాయుడు, ఆశన్న, భీమన్న, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com